శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## మహిళల భద్రతకు బాసటగా నిలుస్తున్న దిశ యాప్



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 22, ప్రభాతవార్త:** మహిళలకు రక్షణ కవచంలా 24 గంటలు 365 రోజులు పని చేస్తున్న దిశా యాప్ మహిళల భద్రతకు బాసటగా నిలుస్తుందని, అర్ధరాత్రి వేళ దిశ యాప్ ద్వారా సకాలంలో మరో మహిళ ప్రాణాలు కాపాడమని జిల్లా ఎస్పీ విజయరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసులు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చరిత్ర సృష్టిస్తుంది. దిశ అప్లికేషన్‌పై రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దిశ యాప్ డౌన్‌లోడ్‌తో పాటు రిజిస్ట్రేషన్ కోసం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కోట్లాది మంది మహిళలు అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకుంటున్నారని వివరించారు. దిశ యాప్ డౌన్‌లోడ్‌తో పాటు రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా సకాలంలో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**మహిళను కాపాడిన కావలి పోలీసులు...**



నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని తుమ్మలపెంట సముద్రతీరం వద్ద ఉన్న రిసార్ట్స్‌కి తీసుకునివెళ్లి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ తనతో పాటు మరో ఇద్దరు కలిసి అత్యాచారయత్నం చేయాలని మహిళను వేధించడంతో అందుకు నిరాకరించిన మహిళ, ఒక వైపు ముగ్గురు వ్యక్తులు దాడి చేస్తూ చంపేస్తామని బెదిరిస్తుండగా, భయపడుతూనే మరోవైపు తనను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో బాధితురాలికి అత్యంత విపత్కర పరిస్థితుల్లో దిశా యాప్ గుర్తొచ్చి వెంటనే తన ఫోన్‌లోని దిశ యాప్ ఎస్ఓఎస్ కాల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించిన మహిళను కాపాడారు. అర్ధరాత్రి 1:19 సమయంలో దిశ యాప్ ద్వారా సమాచారం అందుకున్న కావలి రూరల్ సిఐ రాజేష్ వెంటనే నైట్ రౌండ్స్ బీట్ ఉద్యోగంలో ఉన్న ఏఎస్ఐ కె.శివయ్య, ఇద్దరు కానిస్టేబుల్స్ వి.మురళి, ఎస్.రాజేష్ బాబులను అలర్ట్ చేయడంతో నిమిషాల వ్యవధిలో బాధితురాలి వద్దకు చేరుకుని భరోసా కల్పించి, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని బాధితురాలిని రక్షించారు. 24న7 దిశ యాప్ ద్వారా ఇటువంటి నేరాలు అరికట్టుటకు దిశ యాప్ ఎంతో తోడ్పాటునందిస్తుందనడానికి ఇదే నిదర్శనం. సకాలంలో స్పందించి బాధితురాలిని రక్షించిన కావలి రూరల్ పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.



## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, నవంబరు22 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాం జనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి ఆలయ ప్రధా న అర్చకులు నాగ రాజాచార్యుల ఆధ్వర్యంలోఅభిషేకం, నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా చేపట్టారు. ఉభయ కర్తలుగా శాంతినగర్‌కు చెందిన హరిహరపుత్ర సమాజం నిర్వాహకులు వ్యవహరించారు. రుత్వికులు సుబ్బయ్య స్వామి, జయప్రకాష్ స్వామి, నందకుమార్ స్వామి ఉన్నారు.

## ఎస్సీ దళిత బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

**కావలి, నవంబరు 22 ప్రభాతవార్త** ఎస్సీ, దళిత, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎస్సీ కమిషన్ రాష్ట్ర సభ్యులు కె.బసవరావు తెలిపారు. కావలి పట్టణ పోలీస్ అతిధి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నవరత్నాల కార్యక్రమం ద్వారా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.దేశంలో ఏ రాష్ట్రంలో అమలుకానన్ని సంక్షేమ పథకాల్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి అమలు చేస్తుందన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని దళితులు సద్వినియోగం చేసుకొని జీవన ప్రమాణాలను



మెరుగుపర్చుకోవాలన్నారు. ఎస్సీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతుందన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హోం శాఖ మంత్రిగా దళిత మహిళను నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. దళితులకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అధికారులు పాటుపడాలని ఎస్సీ కమిషన్ సభ్యులు బసవరావు ఆదేశించారు. కొండాపురం మండలం మర్రిగుంట గ్రామంలో ఎస్సీ కులానికి చెందిన ఇండ్ల చిన అంకయ్యకు సంబంధించిన భూసమస్యపై ఇక్కడికి రావడం జరిగిందన్నారు. దళితుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కావలి ఆర్డీవో శీనానాయక్, తహశీల్దార్ మాధవరెడ్డి, కావలి పట్టణ సిఐ శ్రీనివాసరావు,సంక్షేమ హాస్టళ్ళ అధికారులు పాల్గొన్నారు. ఎస్సీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు బసవరావును పలువురు దుశ్శాలువాతో సత్కరించి పూలబొకెను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత నాయకులు దాసరి బాలకృష్ణ, ఎలికా చంద్రశేఖర్, బొమ్మిళ్ళ బాలచెన్నయ్య, దాసరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు పనుల అభివృద్ధి సమిష్టి బాధ్యత

**కోవూరు, నవంబరు22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం అభివృద్ధి సమిష్టి బాధ్యత అని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు అన్నారు. కోవూరు మండలం గుమ్మల దిబ్బ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఈ పనులను పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పాఠశాలలో ఉపాధ్యాయులకు సెలవులు పెట్టడం వారి హక్కే అని , ఈ విషయంలో కాదనేది లేదని, అయితే విద్యార్థుల భవిష్యత్తు కూడా ముఖ్యమేనని



ఉపాధ్యాయులు గమనించాలన్నారు. ఒకే పాఠశాలలో ఉన్న కొంతమంది ఉపాధ్యాయుల్లో 6 మంది మెడికల్ లీవ్ పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమయంలో ఈ విధంగా సెలవులు పెడితే విద్యార్థులు భవిష్యత్తు ఏమిటని ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకునేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా లోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 22,23 తేదీల్లో సైన్స్‌ఫేర్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, నెల్లూరు ఎంఈవో తిరుపాలు, కోవూరు ఎంఈవో రహీమ్, ఐకేపీ ఏపీఎం వెంకటస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## స్వర్ణ గరుడవాహానంపై నృసింహ స్వామి

**పెంచలకోన(రాపూరు), నవంబరు 22 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతీ నక్షత్రం సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించి, చందనాలంకరణ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి నృసింహ హమం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పలు రకాలైన సుగంధ ద్రవ్యాలు,పాలు,పెరుగు, తేనే. నెయ్యి, చక్కెర వంటి వాటితో అభిషేకం నిర్వహించారు. మద్యాహ్నం 12 గంటలకు స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి ఎంతో ఇష్టమైన స్వర్ణ గరుడవాహనంపై స్వామి వారిని వుంచి కోనలో స్వామి వారికి స్వర్ణ గరుడవాహన





సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలిసిన భోజన,వసతి ఏర్పాట్లును ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

## జిల్లా వక్ఫ్ బోర్డ్ వైస్ చైర్మన్‌గా షౌకత్ అలీ



**నెల్లూరు టౌన్, నవంబరు 22, ప్రభాతవార్త:** జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్‌చైర్మన్‌గా ఏఎస్ పేట మండలం అనుమసముద్రం గ్రామానికి చెందిన షేక్ సౌకత్ అలీను నియమిస్తూ మంగళవారం స్టేట్ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ ఖాదర్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలోని స్టేట్ బోర్డు కార్యాలయంలో షౌకత్ అలీకు నియామక పత్రాలను అందజేశారు. షౌకత్ అలీ గతంలో అనుమసముద్రం ఉపసర్పంచుగా ప్రస్తుతం వైసీపీ మండల యూత్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకంతో నియమించిన ఈ పదవికి వన్నె తెస్తానన్నారు. అలాగే తనకు పదవి రావడానికి సహకరించిన ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డికి, మండల వైసీపీ కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డికి, మండల జెడ్పీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కమిటీ సలహాలతో వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

## నవ్యాంధ్ర ఎమ్మార్పీయస్ జిల్లా అధ్యక్షుడిగా కొండా అనిల్‌కుమార్



**నెల్లూరు టౌన్, నవంబరు 22, ప్రభాతవార్త:** ఎమ్మార్పీయస్ నెల్లూరు జిల్లా నూతన అధ్యక్షుడిగా కొండా అనిల్‌కుమార్ నియామకాన్ని నవ్యాంధ్ర ఎమ్మార్పీయస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం మంగళవారం ప్రకటించారు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న కొండా అనిల్‌కుమార్ సేవలను నవ్యాంధ్ర ఎమ్మార్పీయస్ చేస్తున్న ఎస్సీ వర్గీకరణ పోరాటాలకు మరియు అరుంధతీయుల (మాదిగ) హక్కులను కాపాడేందుకు ఉపయోగపడే విధంగా ఈ నియామకం జరిగిందన్నారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ తనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ జాబితాలోని మొత్తం 59 కులాలకు సంబంధించిన రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవట్లేదని ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వాల జాప్యం చేయడం వలనే పూర్తి స్థాయిలో అరుంధతీయులు (మాదిగలు) అభివృద్ధికి నోచుకోవడంలేదని, అందువలనే నానాటికి దీనావస్థలో దిగజారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో కచ్చితంగా ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదించాలని డిమాండ్ చేశారు. మాదిగల మీద ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఎస్సీ జాబితాలోని 59 కులాల్లో నిర్వీర్యం చేసే దిశగా ప్రభఉత్వాలు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను కేటాయించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మాదిగల అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీయస్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేపల్లి రమణరావు, సలహాదారు పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పత్రి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శివస్య హృదయం,విష్ణుహు.. విష్ణుష్య హృదయం శివహ

**కలువాయి నవంబర్ 23 ప్రభాతవార్త** శివాయ విష్ణు రూపాయ, శివరూపాయ విష్ణువే,శివస్య హృదయం విష్ణుహు విష్ణుస్య హృదయం శివహ. శివుడే విష్ణురూపంలో,విష్ణువే శివరూపంలో శివుని యొక్క హృదయం విష్ణువులో,విష్ణువు యొక్క హృదయం శివుడులో ఉన్నట్లుగా శాస్త్రవచనం అని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం ప్రధానార్చకులు సోమశేకరస్వామి తెలిపారు. మంగళవారం స్వామి వారి



జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం అదే విధంగా కార్తిక మాసాన్ని పురస్కరించుకొని శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవంను ,కార్తిక దీపోత్సవాన్ని దేవస్దానం నందు ఆలయ వ్యవస్దాపకులు నరసయ్యస్వామి ఆద్వర్యంలో వేదపండితులు వైభవంగా నిర్వహించారు.ఉదయం నుండి కార్యక్రమాలలో భాగంగా తిరు ఆరాధన తీర్దగోష్టి వైభవంగా కళ్యాణ మహోత్సవంతోపాటు వేదవిన్నం,మంత్రపుష్పం,మద్యాహ్నం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.సాయింత్రం విష్ణుసహస్రనామసో త్రపారాయణం ,ఆరాధాన ,నైవేద్యంతోపాటు కన్నుల విందుగా కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు.కలువాయి లలితా సహస్రనామ పారాయణ బృందం మహిళలచే దీపోత్సవ కార్యక్రమంతోపాటు కోలాటం,భజన కార్యక్రమాలను కన్నుల విందుగా నిర్వహించారు.కార్తికమాసం హరిహరులకు ఎంతో విశిష్టమైన మాసమని స్వామి వార్లకు దీపోత్సవం,కళ్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఎంతో ప్రీతి కరమని వేదపండితులు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నరసయ్యస్వామి,విజయమ్మ దంపతులతోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గోని స్వామి అమ్మవార్లను దర్శించుకొని కార్యక్రమాలను తిలకించారు.

## సంగమేశ్వరుని సన్నిధిలో పండ్లతో భారీ శివలింగం



**సంగం నవంబర్ 22 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని సంగమేశ్వరుని సన్నిధిలో కార్తికమాసం చివరి సోమవారం పురస్కరించుకొని రకరకాల పండ్లతో భారీ శివలింగాన్ని ఏర్పాటు చేశారు.అత్యంత పురాణ చరిత్ర కలిగిన కామాక్షితాయి సంగమేశ్వరుని సన్నిధిలో ఏటా కార్తిక మాసంలో ఇలా పెద్ద శివలింగాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితీ పెద్ద ఎత్తున మహిళలు కార్తిక దీపాలు పెట్టి సంగమేశ్వరుడ్ని,కామాక్షితాయిని దర్శించుకొని తరిస్తుంటారు. పరుశరాముడు ప్రతిష్టించిన శివలింగం ఉన్న ఈ ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల అపారనమ్మకం.శంబోశంకర....హరహర మహదేవా అంటు ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.

## ఏపీ జెన్‌కోను ప్రైవేటీకరణ చేస్తే సహించం

**ముత్తుకూరు, నవంబర్ 22, ప్రభాతవార్త:** మండలంలోని నేలటూరులో నిర్మించివున్న శ్రీదామోదర సంజీవయ్య సూపర్ థర్మల్‌పవర్ విద్యుత్‌కేంద్రాన్ని ప్రవేటీకరణ చేస్తే సహించేదిలేదని టి.డి.పి మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి అన్నారు.మంగళవారం ఎ.పిజెన్‌కోను ప్రవేటీకరణకు వ్యతిరేకంగా టెండర్లు రద్దుచేయాలని జన్‌కోగేటువద్ద ఎ.పిజెన్‌కో జెఎసి పరిరక్షణ కమిటి ఆద్వర్యంలో జన్‌కోగేటువద్ద మహాదర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో టి.డి.పి,సి.పి.ఐ,సి.పి ఎం పార్టీలతోపాటు స్తానికులు పాల్గొన్నారు. ఈసందర్బంగా సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి మాట్లాడుతూ ఎ.పి జెన్‌కో ప్రవేటీకరణ విషయాన్ని మానుకోవాలని లేకపోతే తాడో,పేడో తేల్చుకునేదానికి సిద్దంగావున్నామన్నారు.రైతులు



ఈజెన్‌కో ప్రాజెక్టుకు వారి భూములను త్యాగంచేస్తే వారికి పరిమినెంటుగా ఉద్యోగాలిచ్చిన దాఖలాలులేవన్నారు. ఇప్పటికే కృష్ణపట్నంపోర్టుని అదాని పోర్టుగా మారిపోయిందని జెన్‌కోను కూడా అదానికి అప్పజెప్పడానికే సి.ఎం జన్‌కో మూడవ యూనిట్‌ను జాతికి అంకితం చేశామని చెప్పడం చాలా విడ్డూరంగా వుందన్నారు.ఆయన సొంత జిల్లాలోని పులివెందులకు సంబందించి 39మంది ఉద్యోగస్తులను పరిమినెంటు చేశారన్నారు.ఇక్కడ స్తానికుల పరిస్తితి గాలికొదిలేశారన్నారు.సి.ఎం పర్యటనకు 13కోట్ల రూపాయలు జెన్‌కో యాజమాన్యం ఖర్చుపెట్టడం జరిగిందన్నారు.స్తానిక మంత్రి దీని గురించి ఎందుకు మాట్లాడడంలేదని సూటిగా ప్రశ్నించారు.ఇప్పటికైనా జెన్‌కో యాజమాన్యం ప్రవేటీకరణ విధానం మానుకోవాలని ఆయన హెచ్చరిక జారిచేశారు.ఈకార్యక్రమంలో పరిరక్షణ కమిటి కన్వీనర్ మోహన్‌రావు,టి.డి.పి మండలాధ్యక్షుడు పల్లరెడ్డి. రామ్మోహన్‌రెడ్డి,యువత అధ్యక్షులు మునిరెడ్డి, సి.పి.ఐ ,సి.పి.ఎం నాయకులు పాల్గొన్నారు.

## ఎపిజిబి అందిస్తున్న సేవల్ని సద్వినియోగం చేసుకోవాలి



**కావలి రూరల్, నవంబరు 22 ప్రభాతవార్త** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ అందిస్తున్న సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కావలి ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు తెలిపారు. కావలి ఎంపిడివో కార్యాలయ ఆవరణలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం కావలి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. బ్యాంకు అందిస్తున్న డిపాజిట్ పథకాలను, రుణ పథకాలను, బీమా పథకాలు ఇతర సేవలను వివరిస్తూ కళాజాతర అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఇతర బ్యాంకులతో పోటీ పడుతూ అనతికాలంలోనే ఉత్తమ బ్యాంక్‌గా ఎపిజిబి విస్తరిస్తుందని బ్యాంకు సేవలు, వడ్డీ వివరాలు తెలియజేశారు. ప్రగతి-666, ప్రగతి-666-400 రోజులకు ఎపిజిబి అధిక వడ్డీ అందిస్తుందని ఇంకా గృహ నిర్మాణాలు, వాహన, విద్య, వ్యవసాయ అధారిత రుణాలకు బ్యాంకు విరివిగా అందిస్తుందని కావలి ఎపిజిబి బ్యాంక్ మేనేజర్ బాలకృష్ణారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపియం కాంతారావు, బ్యాంకు అధికారులు శేషాచలం, మానస, నరేంద్ర లక్ష్మి, గాయత్రి, ఎపిజిబి ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు. కళాజాతర నిర్వాహకులు మాధవరావు ఖాతాదారులకు కళాజాతా ద్వారా చైతన్యపరిచారు.

## బోధనా సామాగ్రి పంపిణి



**బుచ్చి నవంబర్ 22 ప్రభాతవార్త** విద్యార్థులకు 3,4,5 తరగతులు బోదించే ఉపాధ్యాయులకు బోధనా సామాగ్రి పంపిని చేసినట్లు ఎంఇఒ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కోవిడ్ కష్టకాలంలో విద్యాప్రమాణాలు కోల్పోయిన విద్యార్థులకు " టీచింగ్ ఎట్‌ది రైట్ లెవల్" కార్యక్రమం కింద ఏపిఎస్‌సి ఆర్‌టి ప్రధమపౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. తెలుగు, గణితం సులభతరంగా బోధించడానికిఈ టీచింగ్ మెటిరియల్ చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమం మార్చి వరకు కొనసాగుతుందని విద్యాప్రమాణాలు మెరుగు పరచడానికి సదవకాశంగా దీనిని తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమం నిర్వహణలో ఏమైనా సందేహాలు ఉండే రిసోర్స్ పర్సన్లను సంప్రదించాలని చెప్పారు. ఈకార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ గండికోట సుధీర్‌కుమార్, సురేంద్ర, సిఆర్‌పిలు శీనయ్య, మల్లేశ్వరరెడ్డి, మహేష్ మస్తానయ్య పాల్గొన్నారు.

## భగవాన్ శ్రీ సత్యసాయబాబా 97వ జన్మదిన వేడుకలు



**బుచ్చి నవంబర్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌లోని సత్య సాయి సుందరేశ్వర నిలయంలో ఈనెల 23 నుండి భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసా యి బాబా వారి 97 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 23 వ తేది ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన్, 6.30 నిమిషాలకు సత్యసాయిబాబా వారికి గోక్షీరాభిషేకం, 8 గంటలకు సత్యసాయి సహస్రనామపూ జ, ఉదయం 9 నుండి 11 గంటలకు స్వామి వారి లీలలు, ఉదయం 11.30 నిమి షాలకు భజనకార్యక్రమం అనంతరం మంగళహారతి మద్యహ్నం 12.30 నిమిషాలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. స్వామివారి దివ్య ఆశీస్సులతో త్వరలో సత్యసాయి ఫంక్షన్ హాల్ ప్రారంభించనున్నట్లు సత్యసాయి సుందరేశ్వర నిలయం కన్వీనర్ తెలిపారు.

## గిరిజనుల గోడు పట్టించుకోండి



**బిట్రగుంట, నవంబరు 22 ప్రభాతవార్త** బోగోలు మండలం పాతబిట్రగుంట గిరిజన కాలనీలో ఏళ్ళ తరబడి పూరి గుడిసెలలో నివసిస్తున్న గిరిజనుల దుస్థితిని పట్టించుకోవాలని మండల సిపియం నేతలు మంగళవారం ఎంపిడివో గోవిందరావుకు, హౌసింగ్ ఎఇ వెంకటయ్యకు వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చి విజ్ఞప్తి చేశారు. ఈ కాలనీలో ఇంక ూనూ పూరి గుడిసెలలో చాలా మంది నివాసం వుం టున్నారని వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూ పించి పక్కా గృహాలు నిర్మించాలని వారు కోరుతు న్నారు. అంతేకాక గతంలో తెలుగుదేశం హయాం లో, కాంగ్రెస్ పార్టీ హయాంలో అర్థాంతరంగా నిలిచిపోయిన పక్కా గృహాల నిర్మాణాల్ని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని వారు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు నవరత్న పథకంలో భాగంగా పక్కా గృహాలు నిర్మిస్తున్నందున ఈ కాలనీ గిరిజనుల గోడు కూడా అధికారులు ఆలకించి చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపియం మండల కార్యదర్శి కె.చినవెంకయ్య, సిఐటియు మండల కార్యదర్శి చల్లా నరహరి తదితరులు వున్నారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఎంపిడివో గోవిందరావు వారికి హామీ ఇచ్చారు.

## సచివాలయాల్లో పనివేళలు విధిగా పాటించాలి




**బిట్రగుంట, నవంబరు 22 ప్రభాతవార్త** గ్రామ సచివాలయాలలో పనిచేసే వివిధ శాఖల కార్యదర్శులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని ఇవోపిఆర్‌డి శ్రీదేవి ఆదేశించారు. మండలంలోని జక్కేపల్లి గూడూరు, సుందరగిరివారికండ్రిక గ్రామాలలో మంగళవారం ఆమె పర్యటించారు. జక్కేపల్లిగూడూరు సచివాలయాన్ని తనిఖీ చేసి అనంతరం జక్కేపల్లిగూడూరు, సుందరగిరివారికండ్రికలలో ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లు పరిశీలించారు. చెత్త నుండి సంపద తయారీ చేసే కేంద్రాలు సమర్ధవంతంగా నిర్వహించాలని, తడి చెత్తను, పొడి చెత్తను ప్రతి ఇంటి నుంచి సేకరించి పారిశుధ్యం మెరుదలతో పాటు సంపద తయారు చేసి పంచాయతీలకు ఆదానవనరుల మార్గంగా చూడాలని ఆమె ఆదేశించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



**కావలి రూరల్, నవంబరు 22 ప్రభాతవార్త** గుర్తు తెలియని వాహనం ఢీకొని కావలి రూరల్ మండలం అడవిరాజుపాళెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మార్టూరు సుశీల(50) మృతి చెందింది. కావలి రూరల్ పోలీసుల వివరాల మేరకు అడవిరాజుపాళెంకు చెందిన మార్టూరు సుశీల గత కొన్ని సంవత్సరాల క్రితం రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకుంది. ప్రస్తుతం కావలి మద్దూరుపాడు ప్లైవోవర్ బ్రిడ్జి క్రింద బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు సుశీల కుమార్తె పైడాల నాగేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుతో కావలి రూరల్ ఎస్ఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్య సేవలు



**కావలి రూరల్, నవంబరు 22 ప్రభాతవార్త** ఫ్యామిలీ ఫిజీషయన్ విధానంతో ప్రతి గ్రామంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం జరిగిందని, ఈ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని కావలి రూరల్ మండలం తుమ్మలపెంట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామంలో మంగళవారం 104 వాహనం ద్వారా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులకు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి 64 రకాల మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట పిహెచ్‌సి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చింతలపాళెంలో బొల్లినేని పరామర్శలు



**జలదంకి, నవంబర్22, ప్రభాతవార్త:** జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాళెంలో మంగళవారం ఉదయగిరి మాజీశాసనసభ్యులు బొల్లినేని వెంకటరామారావు రెండు కుటుంబాలను పరామర్శించారు. గ్రామానికి చెందిన గంగినేని. రామమూర్తినాయుడు, మావిళ్ళపల్లి కృష్ణమూర్తిలు ఇటీవల మృతిచెందారు. ఈసందర్భంగా ఆయన గ్రామానికి విచ్చేసి వారి కుటుంభసభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి మృతికిగల కారణాలను అడిగితెలుసుకున్నారు. తనప్రఘాడసానుబూతిని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీకి సైనికుల్లా పనిచేసి పంచాయతీలో పార్టీపటిష్టతకు పాటుపడ్డారని వారిఅకాల మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కుటుంభాలకు అండగా వుంటామని ప్రకటించారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు వంటేరు. జయచంద్రారెడ్డి, మందపల్లి. మాల్యాద్రి, పూనూరు. భాస్కర్‌రెడ్డి, గుర్రం. ప్రవీణ్, రవి, మందపల్లి. మల్లికార్జున తదితరులు వున్నారు.

## జీతాలులేక కడుపులు కాలుతున్నాయి.. ఇప్పించండిసారూ



**జలదంకి, నవంబర్22, ప్రభాతవార్త:** పంచాయతీలో అస్టాదిచాకిరి చేస్తున్నాం ఏడాదినుంచి జీతాలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము ఇప్పించి పుణ్యంకట్టుకోవాల ని మంగళవారం మండల పరిధిలోని బ్రాహ్మణక్రాక పంచాయతీ పారిశుద్యకార్మికులు ఇన్‌చార్జ్ ఎం.పి.డి.ఒ శ్రీధర్‌కు మొరపెట్టుకున్నారు. వారు మంగళవారం స్థానిక కార్యాలయానికి విచ్చేశారు. పడుతున్న కష్టాలగూర్చి వివరించారు. రెక్కాడితేకాని డొక్కాడని కుటుంభాలు మావి సంవత్సరం పాటు జీతంలేకపోతే మాజీవనం ఎలా అంటూవిన్నవించుకున్నారు. కల్పించుకొని సాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన ఎం.పి.డి.ఒ పరిశీలించి తగు న్యాయం చేస్తామని హామీయిచ్చారు.

## ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



**వరికుంటపాడు, నవంబర్22, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యతను వెలికితీయడంకోసం విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు వరికుంటపాడు గ్రామ సర్పంచ్ కొండెపోగు. దిలిప్‌కు మార్, ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోవున్న ఉన్నతపాఠశాలలో పాఠశాలస్థాయి విద్య, వైజ్ఞానిక కార్యక్రమం నిర్వహించారు. ఈసదస్సులో విద్యార్థులు షుమారు 55 ప్రాజెక్టులకుపైగా నమూనాలను ప్రదర్శించగా సర్పంచ్ దిలిప్‌కుమార్ వీక్షించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలలో 5 ప్రాజెక్టులను మండలస్థాయి ఎంపికకు నిర్వ హించడం జరిగిందన్నారు.

ఈఎంపికైన విద్యార్థులు మండలస్లాయిలో పోటీపడడం జరుగుతుందన్నా రు. ప్రద ర్శనలు అన్నీకూడా సామాజికదృక్‌పదాన్ని పెంపొందించేలవుండడం అందరిని ఆకట్టుకుంది. ఈకా ర్యక్రమం లో స్కూలుకమిటిచైర్మన్ లక్ష్మీనరసింహం, ఉపాధ్యాయులు మల్లికార్జున, ప్రసాద్, రాజేశ్వరరా వు, జ యశ్రీ, శ్యామల, ప్రసాద్, మౌలాలి, పంచాయతీకార్యదర్శి శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంటు సుధీర్ బాబు, విద్యార్ధినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల స్థాపనకు యాజమాన్యం ఎల్లవేళలా సిద్ధం



**కోవూరు, నవంబరు22 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం కళాశాలలోని ఇంక్యుబేషన్ సెంటర్ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్శిటీ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో మూడు పరిశ్రమలను స్థాపించడానికి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రీ ఇంక్యుబేషన్ పోస్టింగ్ అగ్రిమెంట్‌ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నూతన సంస్థలను స్థాపించడానికి కావాల్సిన సాంకేతిక సదుపాయాలను, ఆర్థిఖ సదుపాయాలను అందించడానికి గీతాంజలి కళాశాల ఎప్పుడూ ముందంజలో ఉంటుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు తెలిపారు. ఒప్పందం చేసుకున్న విద్యార్థులను ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మూడు పరిశ్రమలు 1. బౌల్డర్స్ అండ్ చార్టర్స్ వ్యవస్థాపకులు టి. సునీల్, జి. హేమంత్ 2. ఏపీఎస్ఐ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు ఏ. సుమంత్, ఎంఎస్ పవన్‌కుమార్, 3. ఏఎస్ ట్రైలాన్ వ్యవస్థాపకులు షేక్. సల్మా , కె. రంజనిలను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఐఐసీసీ విభాగాధిపతి డాక్టర్ చక్రపాణి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి



**కోవూరు, నవంబరు22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత కలిగిన వారందరికీ అందజేసేలా వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. కోవూరు ఒడలం లేగుంటపాడు గ్రామ పంచాయతీ ఆవరణలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ వారి వారి పరిధిలో ఉన్న 50 కుటుంబాలకు సంబంధించిన పూర్తి సమాచారం వారి వద్ద ఉండాలన్నారు. ఎవరైనా అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందకపోతే అటువంటి వారిని గుర్తించి అందించేలా చొరవ తీసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ జె. రాజగోపాల్‌రెడ్డి, కార్యదర్శి విజయ్‌కుమార్, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఉన్నారు.

## ఓవెల్ స్కూల్ యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలి





**కోవూరు, నవంబరు22 ప్రభాతవార్త :** నెల్లూరులోని ఓవెల్ స్కూల్‌లో విద్యార్థినిపై లైంగిక వేధింపులు చేసిన బ్రహ్మయ్యతో పాటు కళాశాల యాజమాన్యాన్ని కూడా శిక్షించాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సురేంద్ర పేర్కొన్నారు. కోవూరులోని బజార్ సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ జిల్లా సభ్యులు చాన్‌బాషా మాట్లాడుతూ ఆ ప్రైవేట్ పాఠశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడిపేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు తగు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే బాబు, సురేష్, ఎస్‌కే ఖాలేషా, జావిద్, కరిముల్లా, తదితరులు ఉన్నారు.

## తాలూకా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఏకగ్రీవం



**కోవూరు, నవంబరు22 ప్రభాతవార్త :** కోవూరులోని ఏపీఎన్‌జీవో హోమ్‌లో మంగళవారం జిల్లా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్. ఆంజనేయ వర్మ ఆధ్వర్యంలో కోవూరు తాలూకా యూనిట్ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ తాలూకా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్. దిలీప్, అసోసియేట్ అధ్యక్షులుగా కృష్ణంరాజు, కార్యదర్శిగా యు. కోటేష్, కోశాధికారిగా యోగవల్లి, ఉపాధ్యక్షులుగా శ్రీనాథ్, శ్రీనివాసులు, దయాకర్, జాయింట్ కార్యదర్శులు జలజాక్షి, శివకుమార్, శ్రీహరి, మహిళా జాయింట్ సెక్రటరీగా మహేశ్వరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, కోశాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూలమాలతో సత్కరించి ప్రమాణం చేయించారు.

## విశ్వ బ్రాహ్మణ సంఘంచే గణేష్‌కు ఆర్థిక సాయం



**నెల్లూరు టౌన్, నవంబరు 22, ప్రభాతవార్త:** నెల్లూరు నగరం బివిఎం నగర్‌కు చెందిన వడ్రంగి పని చేస్తున్న పొంగూరు గణేష్‌కుమార్‌కు విశ్వబ్రాహ్మణ సంఘం మంగళవారం ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నది. గత మూడు రోజుల క్రితం గణేష్‌కుమార్‌కు ప్రమాదం జరిగింది. చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేనందున ఆపరేషన్ ఖర్చులకు బాధిత కుటుంబసభ్యులకు ఈ మేరకు నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఖాజన వెంకట శేషయ్య ఆచారి, ముత్తుకూరు మండలం అధ్యక్షులు పేరంబాకు మల్లికార్జునాచారి సంయుక్తంగా వైద్య ఖర్చులకు రూ.7500 ఆర్థిక సాయం అందజేశారు. గణేష్‌కుమార్ చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి తామున్నాం అనే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయవేలూరు భాస్కర్ ఆచారి, మహేష్ ఆచారి, ఈపూరు ప్రసాద్ ఆచారి తదితరులు పాల్గొన్నారు. బాధితుడు గణేష్‌కుమార్‌ను ఆదుకునేందుకు అండగా నిలబడిన ప్రతి ఒక్క విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులకు నెల్లూరు రూరల్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పొంగూరు వెంగయ్య ఆచారి కృతజ్ఞతలు తెలిపారు.

## నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



**సీతారామపురం నవంబర్ 22 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలో మన బడి నాడు-నేడు రెండోవ విడతలో భాగంగా మండలంలో పాఠశాలలో నిర్వహిస్తున్న మనబడి నాడు-నాడు భవన నిర్మాణపనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపిఇ డబ్ల్యూ ఐడిసి ఏఇ శ్రావణ్‌కుమార్ సూచించారు. మంగళవారం బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మన బడి నాడు-నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్త పరచారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు నాడు-నేడు ద్వారా మంజూరు అయిన తరగతి గదులను త్వరగా పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజయ్య, ఏడుకోండలు, గుత్తేదారులు తదితరులు పాల్గోన్నారు.

## విద్యుత్ స్తంభంతో పొంచి వున్న ప్రమాదం



**బిట్రగుంట, నవంబరు 22 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభం తుప్పుపట్టి కూలిపోయే పరిస్థితిలో వుంది. ఏ క్షణంలోనైనా దీని వల్ల ప్రమాదం పొంచి వుందని ఈ ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా సంవత్సరాల క్రిందట వేసిన స్తంభం కావడంతో క్రింద భాగమంతా తుప్పుపట్టింది. తక్షణమే దీని స్థానంలో వేరే స్తంభాన్ని వేసి ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## లీడర్‌షిప్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాంకి ఎంపికైన రహిమన్



సీతారామపురం నవంబర్ 22 ప్రభాతవార్త రాష్ట్రవ్యాప్తంగా ఇండియన్ ఇన్‌స్టూట్యూట్ ఆఫ్ అహ్మదాబాద్‌వారు నిర్వహించిన లీడర్‌షిప్ స్కిల్ ఆన్‌లైన్ ఎగ్జామ్‌లో సీతారామపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిఫల్ ఎస్‌ఎం రహిమాన్ ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇటీవల రాష్ట్ర వ్యా ప్తంగా ఇండియన్ ఇన్‌స్టూట్ ఆఫ్ మేనేజమెంట్ సంస ్థ లీడర్‌షిప్ స్కిల్స్‌పై ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహించారని దానిలో మన రాష్ట్రం నుండి 50 మంది ప్రధానోపాధ్యాయులు జిల్లా నుండి 5 మంది ప్రధానోపాధ్యాయులు ఎంపికై య్యారని తెలిపారు. ఎంపికైన వారికి గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టూట్‌ఆఫ్ మేనేజమెంట్ వారు లీడర్ స్కిల్‌పై శిక్షణ ఇస్తారని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అందరంతమ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు లీడర్‌షిప్ వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తామని అంతేకాకుండా జిల్లాలోని పలు పాఠశాలలో లీడర్‌షిప్ స్కిల్స్ గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## డిఎ, పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలి



**కోవూరు నవంబర్ 22 ప్రభాతవార్త** కోవూరులోని బైనా సన్స్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ బాడి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అద్యక్షులు ఏ సుబ్బారావు మాట్లాడుతు పదవివిరమణ చేసిన పెన్షనర్లకు ఒకటోతేది పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పిఆర్‌సి, డిఎ అరియర్స్ మొత్తం చెల్లించాలని పేర్కున్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన పెన్షనర్లకు బహుమతులు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి పరబ్రహ్మమం .ఎ వెంకయ్య, కోశాదికారి పి వెంకటేశ్వర్లు, తదితరులు హాజరైయ్యారు.

## ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని సత్కరించిన కాపునాడు అధ్యక్షుడు మహేష్



**కావలి, నవంబరు 22 ప్రభాతవార్త** కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి కాపునాడు కావలి నియోజకవర్గ అధ్యక్షుడు, స్వర్ణాంధ్ర ఎంటర్‌ప్రైజస్ అధినేత బండారు మహేష్‌నాయుడు వెళ్లి ఎమ్మెల్యేనిదు శ్సాలువాతో ఘనంగా సత్కరించారు. కాపునాడు కావలి నియోజకవర్గ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన సంద ర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. మహేష్‌నాయుడుకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

## పాతాళపల్లి లో చెరువు వేలం 25న

**అనంతసాగరం, నవంబర్22ప్రభాతవార్త:** అనంతసాగరం మండలం పాతాళపల్లిలో ని చెరువుకు వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య మంగళవారం తెలిపారు. ఈనెల 25న శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు చెరువుకు వేలంపాట నిర్వహిస్తామని , వేలంపాటలో పాల్గోనే వారు 10వేల రూపాయలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

## ఎర్రచెరువుకు వేలంపాట 26న

**అనంతసాగరం, నవంబర్22ప్రభాతవార్త:** మండలంలోని పడమటికంభంపాడు లోని ఎర్ర చెరువుకు ఈనెల 26న బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి నరేంద్ర తెలిపారు. ఈవేలంపాట 11గంటలకు జరుగుతుందని పాల్గోనే వారు 15వేల రూపాయలు డిపాజిట్ చెల్లించాలని వారు తెలిపారు.

## పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా వైకుంఠపురం వాసుల వెతలు

**కావలి, నవంబరు 22 ప్రభాతవార్త** పాలకుల నిర్లక్ష్యానికి వైకుంఠపురం వాసులు సమస్యల వలయంలో చిక్కుకొని తల్లడిల్లిపోతున్నారని జనసేన పార్టీ కావలి నియోజకవర్గ నాయకుడు, చిరంజీవి యువత పట్టణ అధ్యక్షుడు యం.వి.సిద్దు తీవ్ర స్థాయిలో విమర్శించారు. వైకుంఠపురం బ్రిడ్జిని ఇప్పటికైనా నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిద్దు నాయకత్వంలో మంగళవారం కావలి అన్నపుగుంటలో దిగి నిరసనలు వ్యక్తం చేశారు. ఆ ప్రాంత ప్రజల్ని ఆకర్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేదలు నివసించే వైకుంఠపురం పట్ల పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పాలకుల, అధికారుల అసమర్థతను ఎత్తిచూపుతూ జనసేన జలదీక్ష చేపట్టిందన్నారు. గత పది సంవత్సరాలుగా వైకుంఠపురం బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. వైకుంఠపురం, పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ, నార్తు జనతాపేట వాసులు రైల్వే ట్రాక్‌ను దాట లేక నిత్యం ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారన్నారు. బ్రిడ్జి నిర్మాణం నిలిచిపోవడంతో రైల్వే ట్రాక్ దాటుతూ దాదాపు 20 మంది వృద్దులు, వికలాంగులు రైళ్ల క్రింద పడి చనిపోయారన్నారు. అయినా ఈ పాలకుల్లో చలనం రాలేదన్నారు. రైల్వే ట్రాక్ దాట లేక పట్టణంలోకి వచ్చేందుకు ఆటోలకు చార్జీలు చెల్లించలేక ప్రజలు ఈ పదేళ్ళ పాటు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వే ట్రాక్ క్రింద మురికినీరు పోయే తూములో బాట చూపించి ఏదో ఘనకార్యం చేసి నట్లుగా పాలకులు చంకలు గుద్దుకోవడం హాస్యాస్పదంగా వుందన్నారు. ఈ మురుగు నీళ్లలో విద్యార్థులు, మహిళలు రాకపోకలు సాగించలేక పాలకుల, అధికారుల అసమర్థతను దుయ్యబుడుతున్నారన్నారు. అన్నపుగుంటను పార్కుగా చేస్తామని ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. పిచ్చిమొక్కలు, నాచు, వ్యర్దాలతో అన్నపుగుంట అధ్వాన్నంగా, దుర్గంధభూయిష్టంగా మారితే మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని దుయ్యబట్టారు. అన్నపుగుంట సర్వరోగాల ఉత్పత్తి కేంద్రంగా మారిందన్నారు. హానికర దోమలన్ని ఇక్కడే పెరుగుతున్నాయన్నారు. కుళ్లిన కంపు కొడుతున్న ఈ మురికినీరు పారే నీళ్లలో ఈ ప్రాంతం ప్రజలు రాకపోకలు సాగించే ఖర్మ, దుస్థితి దాపురించిందన్నారు. రైల్వే అధికారులు వంతెన క్రింద పిడబ్ల్యుఐ యూనిట్, ఓహెచ్ఇ షెడ్ నిర్మాణం చేసుకొని బ్రిడ్జి క్రింద రాకపోకలు నిషేధించారన్నారు. అన్నపుగుంట తూముకు ఎదురుగా బాట వేసుకోవాలని రైల్వే అధికారులు చెబుతున్నారన్నారు. బాట కూడా వేయలేని దౌర్భాగ్యస్థితిలో కావలి మున్సిపాల్టీ వుందని దుయ్యబట్టారు. పాత బిల్డింగ్‌ల వేస్ట్ మెటీరియల్‌తో బాట వేయిస్తానని మున్సిపల్ కమిషనర్ చెప్పడం సిగ్గుచేటైన విషయమన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి తెలియకుండా పట్టణంలో చీమ కూడా దూరదని జనసేన నేత సిద్దు తెలిపారు. మున్సిపాల్టీలో ఏమి జరుగుతుందో ఎమ్మెల్యేకి తెలుసా లేక ఆయన నటిస్తున్నారా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణం, అన్నపుగుంటకు శాశ్వత పరిష్కారం, వైకుంఠపురంలో సదుపాయాలు కల్పించాలని జనసేన నేత సిద్దు డిమాండ్ చేశారు జనసేన పార్టీ కావలి రూరల్ అధ్యక్షులు తిరుపతి స్వామి, పసుపులేటి సురేష్, తోట సాయి, మనోజ్‌కుమార్, జోషి, రమేష్, విజయ్, విష్ణు, చక్రి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## హరిహరపుత్ర ఆలయంలో ప్రత్యేకపూజలు



**వింజమూరు, నవంబర్22ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీపరిధిలోని ప్రసన్నారెడ్డి నగర్‌లో వేంచేసియున్న శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం కారీ ్తకమాస అన్నదాన కార్యక్రమాన్ని ఉభయకర్తలు పుప్పోలు రాఘవయ్య - వరలక్ష్మి, ఆయన తనయుడు వీరశేఖర్ - సుమలత , మనవళ్ళు సాయిచరణ్, సాయి సంతోష్‌లు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయం ముందు నెలకొల్పబడిన శివలింగానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు . సాయిబాబా ఆలయ పూజారి నవీన్ స్వామి వినాయకస్వామి పూజ, సుబ్రహ్మణ్య స్వామి అషో త్రం నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి పూజను ఎసిడిసి ప్రసాద్, చేబ్రోలు వసంతరావ్, దేవర, డివి , మస్తాన్‌రెడ్డి, మనం హరీష్, వెలుగోటి కృష్ణలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అయ్యప్ప , శివమాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 119 మంది రైతులకు రూ.2.04.962 వైస్ఆర్ సున్నా వడ్డీ

ప్రకటన
కావలి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో 21-11-2011 తేదీన డాక్యుమెంటు నెం. 6182/2011 గా రిజిష్టరు కాబడిన ఒరిజినల్ పార్టిషన్ డీడ్ 05-02-2021 తేదీన కావలి కోర్టు సెంటరు నందు పోయినది. దొరికిన వారుతెలియజేయగలరు.
ఇట్లు : కొర్రపాటి మురళీధర్ రావు,
సెల్ - 9989594817

**రాపూరు, నవంబరు 22 ప్రభాతవార్త** మండలంలో రబీ సీజన్‌కు సంబందించి వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలకు 119 మంది రైతులు ఎంపికైనట్లుమండల వ్యవసాయాధికారి తెలిపారు. వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల కింద రూ. 1 లక్ష లోపు రుణం తీసుకోనిసకాలంలో చెల్లించిన 119 మంది రైతులకు సంబం దించి రూ.2.04.962 రూపాయిలు త్వరలో ఆయా రైతుల ఖాతాలలో జమ చేయనున్నట్లు తెలిపారు. అ లాగే సకాలంలో రుణాలు చేల్లించి జాబితాలో పేర్లు లేని రైతులు వ్యవసాయశాఖ కార్యలయంలో సంప్రదిస్తే వారి వివరాలు నమొదు చేసుకోని వారిని కూడా వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ రుణంలో చేర్చేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

## నూతన మెనూను పాటించాలి

**చేజర్ల, నవంబర్22ప్రభాతవార్త:** మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నూతన మెనూను ప్రభుత్వం నిర్ణయించినట్లు చేజర్ల ఎంఇఒ పంచాగ్నుల కళాధర్ పేర్కొన్నారు. గతంలో ఉన్న మెనూ కాకుండా కొత్త మెనూ ప్రకారమే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. సోమవారం హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు, లేదా కూరగాయల వులావ్ , కోడిగుడ్డుకూర చిక్కి , మంగళవారం పులిహోర, టమోటాపచ్చడి లేదా దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, బుధవారం కూరగాయల అన్నం, బంగాళాదుంపల కుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి, గురువారం సాంబార్‌బాత్, ఉడికించిన కోడిగుడ్డు, శుక్రవారం ఉడికించిన అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చికి ్క, శనివారం ఆకుకూర అన్నం, పప్పుచారు, స్వీట్‌పొంగలిని తయారుచేసి విద్యార్థులకు అందించాలన్నారు. అన్ని పాఠశాలల్లో నూతన మెనూను పాటించాలని ఆయన కోరారు.

## ఆర్డీవో నివాస ప్రాంగణంలో పందులు తోలుతారా



**కావలి, నవంబరు 22 ప్రభాతవార్త** కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని నివాస ప్రాంగణంలోకి పందులు తోలుతారా అంటూ కావలి ఆర్డీవో శీనానాయక్ మండిపడ్డారు. మంగళవారం పందుల్ని పెంచుకునేందుకు స్థలం కేటాయించాలని పందుల పెంపకందారుడు ఆర్డీవోని కలిసి అర్జీ ఇచ్చారు. ఈ సమయంలో పందుల పెంపకందారుడ్ని మందలించారు. ఆర్డీవో కార్యాలయ ఆవరణలో నివాస ప్రాంగణం వద్ద పెంచుతున్న కూరగాయల, పూలమొక్కల్ని పందుల్ని రాత్రి వేళలలో వచ్చి ధ్వంసం చేస్తున్నాయని ఆర్డీవో మండిపడ్డారు. పందులకు అడ్డుకట్ట వేయకపోతే చర్యలు తప్పవని ఆర్డీవో మందలించారు. ఇదిలావుంటే ఆర్డీవో నివాస ప్రాంగణంలో గందరగోళం సృష్టిస్తున్న పందులకు అడ్డుకట్ట వేయలేకపోతే ఇక పట్టణంలో పందుల మందలకు దిక్కేదని ప్రజలు వాపోతున్నారు.

## 24న జరిగే వేలం రద్దు

**గుడ్లూరు, నవంబరు 22, ప్రభాతవార్త** గుడ్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో వ్యాపార సముదాయం నందలి రూములు అద్దెకు ఇచ్చు నిమిత్తం ఈనెల 24వ తేదీన నిర్వహించే వేలంపాటను కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేయడం జరిగిందని ఎంపీడీఓ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలని ఆయన తెలియజేశారు. మరలా ఎప్పుడు నిర్వహించేంది తేదీని ప్రకటిస్తామని చెప్పారు.

# స్వాములకు బిక్ష ఏర్పాటు చేసిన ఇంటూరి

**ఉలవపాడు, నవంబరు 22, ప్రభాతవార్త** మాల ధారణ చేసిన స్వాములకు ఇంటూరి నాగేశ్వరరావు బిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని కరేడు గ్రామంలో ఓరుగంటమ్మ ఆలయం వద్ద దాతల సహకారంతో గత 25రోజులుగా మాలధారణ చేసిన స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 26వ రోజు మంగళవారం నాడు కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు మాల ధరించిన స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. ముందుగా అయ్యప్ప స్వామికి పూజలు చేసి అనంతరం అన్న దాన కార్యక్రమం ప్రారంభించిన ఇంటూరి నాగేశ్వరరావు స్వయంగా భక్తులకు వడ్డించారు. మాలధారణ చేసి న స్వాములకు సంబంధించిన కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర ్భంగా నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు కన్నా ప్రసాద్, పార్టీ నాయకులు బంగారురెడ్డి, పోలుబోయిన శ్రీనివాసులు, హరిబాబు, రామదాసు, బాలచంద్రరరావు, వెంకటరమణ, శ్రీధర్, వెంకటరావు, శ్రీను, బాలమురళి, కత్తికొండయ్య, కత్తి మహేష్, కత్తి శ్రీహరి, వెంకటరావు, రాచగర్ల శివ ఇతర నాయకులు పాల్గొన్నారు.



# అయ్యప్ప ఆలయంలో స్వాములకు 28 వ రోజు అన్నదానం

**రాపూరు, నవంబరు 22 ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో కర్తీక మాసం సందర్భంగా అయ్యప్ప స్వాములకు, గోవింద స్వాములకు 28 వ రోజైన మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ అయ్యప్ప స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా పలు రకాలైన సుగంధ ద్రవ్యాలు, గంగాజలం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకారం నిర్వహించారు. అనంతరం మద్యాహ్నం రాపూరుకు చెందిన గంగిశెట్టి వెంకటేశ్వర్లు స్వాములకు అన్నదానంనిర్వహించారు. సాయంత్రం శ్రీ మహావిష్ణువు ఆలయ ధ్వజస్థంబానికి అకాశ దీపం వెలిగించారు. అనంతరంస్వామి వార్ల ఆలయంలోఅయ్యప్ప స్వాములు, గోవింద స్వాములు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వాములకు దగ్గుబాటి వేంకటేశ్వర్లు, రేణుకా దంపతులు స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున స్వాములు ఈ కార్యమ్రంలో పాల్గోని పూజలు నిర్వహించి భిక్ష స్వీకరించారు.

## పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ

**కావలి, నవంబరు 22 ప్రభాతవార్త** కావలి పట్టణం శివరామసుబ్బయ్య కాలనీలో మంగళవారం సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో 50 మంది నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. స్వర్గీయ బీమరాజు చంద్రశేఖర్‌రావు జ్ఞాపకార్థంగా బెంగుళూరులో నివసిస్తున్న ఆయన సతీమణి అన్నపూర్ణ, కుటుంబ సభ్యుల తరపున పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేశారుగంగపట్నం సురేంద్ర పాల్గొని పేదలకు అందజేశారు.



# అయ్యప్ప సన్నిధిలో అన్నదానం

**వింజమూరు, నవంబర్22ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని మద్దూరు పాపిరెడ్డి నగర్‌లో వేంచేసియున్న శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 28వ రోజు అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు జంపాని వెంకటేశ్వరరావ్-నాగమ్మ ల తనయుడు, స్థానిక ఎస్ఐ జంపాని కుమార్ ఆయన సతీమణి నాగమౌనిక, ఆయన కుమారుడు వెంకట యశ్వంత్‌లు మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ఆలయంలోని వినాయకునికి పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామికి అష్టోత్రం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు . అనంతరం అన్నదానకా ర్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అయ్యప్ప భక్తులు నిష్టనియ మాలతో శబరిమలకు వెళ్ళేమార్గంలో జాగ్రత్తలు పాటిస్తూ పయనించాలని సూచించారు. ఈకార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



## చిరుజల్లులు, చలిగాలులు వణికిపోతున్న జనం



**బుచ్చి నవంబర్ 22 ప్రభాతవార్త** అల్పపీడనం ప్రభావంతో మండలంలో గత రెండు రోజుల నుండి చిరుజల్లులు,చలిగాలులతో ప్రజలు వణికిపోతున్నారు. వృద్దులు,చిన్నపిల్లల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది.కారుమబ్బులు,చిమ్మచీకట్లతో ప్రజలు పనులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.ఈ వర్షాలు,చలిగాలులు త్వరగా పోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**ఉదయగిరి నవంబర్ 22 ప్రభాతవార్త** ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని లింగమనేని పల్లి,కృష్ణారెడ్డిపల్లి ,కొత్తపల్లి గ్రామాలలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఎమ్మెల్యే పర్యటించారు. ఆయన గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంబోత్సవాలు శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.పలు సమస్యలకు అక్కడే అధికారుల ద్వారా పరిష్కారం చూపించారు. ఈకార్య క్రమంలో ఎంపిడిఒ హైజాక్ ప్రవీణ్,సిఐ గిరిబాబు, ఎంఇఒ ,వైసిపినాయకులు సచివాలయ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గోన్నారు.

## అల్లూరులో గడపగడపకు మన ప్రభుత్వం



**అల్లూరు, నవంబరు 22 ప్రభాతవార్త** గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని అల్లూరు హరిజనవాడలో మంగళవారం కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేసి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన పథకాలను వారికి తెలియజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇచ్చిన మాట తప్పకుండా నవరత్న పథకాల ద్వారా అనేక మంది లబ్దిపొందారన్నారు. రాబోయే రోజులలో జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని ఆయన తెలిపారు. కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, వైసిపి మండల అధికార ప్రతినిధి సామంతుల సురేష్‌రెడ్డి, డిప్యూటీ తహాశీల్దార్ చెంచయ్య, ఆర్ఐ సుధీర్, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, జి.సురేంద్రబాబు, మేడా కృష్ణారెడ్డి, కోడూరు సాధక్‌రెడ్డి, దైవాదీనం, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఉస్మాన్ షరీఫ్, జాంబి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సచివాలయాల పనితీరు మెరుగుపడాలి



కొండాపురం,నవంబర్22,ప్రభాతవార్త: సచివాలయాల పనితీరు మెరుగుపడాలని ట్రైనీ డిప్యూటికలెక్టర్ మహేష్ అన్నారు.మంగళవారం కొండాపురం మండలం కొమ్మి,సత్యవోలు పంచాయతీలలో వున్న సచివాలయాలను ఆయన తనిఖీచేశారు.తొలుత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్తమీద ప్రజలకు నమ్మకంకలిగేల చూడాల్సిన భాధ్యత మీమీదుందన్నారు.ఇక్కడికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా అర్హులైన ప్రతివక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేవిదంగా చూడాలన్నారు.సచివాలయాలకువచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించేదిశగా చూడాలన్నారు.అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

# నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

**కోవూరు, నవంబరు22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలనే ధ్యేయంతో అమలు చేసిన జగనన్న గోరుముద్ద పథకంలో నాణ్యతా ప్రమా ణాలు తప్పనిసరి అని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. కోవూరు మండలంలోని కొత్తూరు, పాటూరు , గుమ్మలదిబ్బ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం మెనూలో పలు మార్పులు చేసి ఈ నెల 21వ తేది నుంచి వాటిని అమలు చేసేలా ఆదేశాలు కూడా ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూను ఏజెన్సీలు తప్పక అమలు చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడేది లేదన్నారు. అదేవిధంగా విద్యార్థులకు భోజనం వడ్డించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలన్నారు. ఏజెన్సీలు కూడా చేతులకు గ్లౌజులు వేసుకుని పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఆయన ఏజెన్సీలకు పలు ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులంతా తప్పనిసరిగా పాఠశాలలో తినేలా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో శ్రీహరి, మండల విద్యాశాఖ అధికారులు రహీమ్, తిరుపాలు, ఏపీఎం వెంకటస్వామి, సీఆర్‌పీలు , ఉపాధ్యాయులు ఉన్నారు.



# కార్మిక కుటుంబాలను వీధుల పాలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**కావలి, నవంబరు 22 ప్రభాతవార్త** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ పేరుతో కార్మిక కుటుంబాల్ని వీధుల పాలు చేస్తున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ విమర్శించారు. కావలి పట్టణ సిఐటియు కార్యాలయంలో మంగళవారం సిఐటియు 4వ మహాసభ జరిగింది. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగంలో వున్న పరిశ్రమలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మికుల పొట్టకొట్టిందన్నారు. కనీస వేతనాలు అమలు చేయకుండా, పనిభద్రత కల్పించకుండా నిర్లక్ష్యంగా కార్మికుల పట్ల వ్యవహరిస్తుందన్నారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు కార్మికుల, ప్రజల నడ్డివిరుస్తు న్నాయన్నారు. కార్మికులకు, ఆశ, అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికుల పనిభారాన్ని పెంచి కష్టాన్ని దోచుకుంటుందన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో వున్న దామోదర సంజీవయ్య విద్యుత్ ప్లాంట్‌ను ఆదానికి అప్పజెప్పేందుకు ఈ ప్రభుత్వాలు సిద్దంగా వున్నాయ న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా, ఉద్యోగ వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా పోరాటాలు సాగించి హక్కుల్ని పొందాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.కె.రెహనాబేగం మాట్లాడుతూ డిసెంబరు నెల 11,12 తేదిలలో ఆత్మకూరు పట్టణంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ మహాసభలో సిఐటియు నా యకులు పసుపులేటి పెంచలయ్య, ఎస్.వెంకయ్య, కె.జాన్, డివైఎఫ్ఐ నాయకులు పెంచల నరసిం హం, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభకు టి.సుబ్బరామశర్మ అధ్యక్షత వహించారు.

**నూతన కమిటీ ఎంపిక...** సిఐటియు కావలి పట్టణ నూతన అధ్యక్షులుగా ఎ.వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా వి.వసుంధరదేవి, విజయలత, ప్రధాన




కార్యదర్శిగా యర్రంశెట్టి కృష్ణమోహన్, సహాయ కార్యదర్శిగా పెంచల నరసింహం, ట్రజరర్‌గా పోలయ్యలు ఎంపికయ్యారు. వీరితో పాటు 21 మందితో నూతన కమిటీని ప్రకటించారు.

# నుడా నిధులతో అభివృద్ధి వేగవంతం

**విడవలూరు నవంబర్ 22 ప్రభాతవార్త** విడవలూరు మండలంలోని చౌకచర్ల గ్రామంలో రెండో వరోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి పర్యటిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నుడానిధులతో అభివృద్ధి వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ టి కాలనీకి 25 లక్షలు, ఎస్‌సి కాలనీకి 25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు వివరిస్తు ప్రజలను ఆప్యాయతగా పలకరిస్తు కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నారు.ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలుకుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిపెస్ట్‌లో 90 శాతం అమలు పరచడం జరిగిందని అన్నారు. టిడిపి హయంలో 40 లక్షల మందికి పెన్షన్లు ఇస్తే వైసిపి హ యాంలో 62 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు.



సిఎం ప్రవేశపెట్టిన పథకాలలో గోరుముద్ద పథ కం ప్రత్యేకమైనదని అభివర్ణించారు.ఈ పథకం ఉద్దేశం పసిబిడ్డలకు నాణ్యమైన ఆహారం అందించాలని మెనూలో ఇచ్చి అమలు పరచడం జరిగిందని అన్నారు. ఇటీవల వేగూరు హైస్కూల్‌లో పిల్లలకు ఇవ్వాలసిన కోడిగుడ్లు తక్కువగా ఉన్నందున దానికి బాధ్యులైన వారిని తొలగించామని అన్నారు. ప్రతి స్కూల్‌పైన మాని టరింగ్ ఉంచాలని జిల్లా కలెక్టర్‌ని కోరుతున్నామని అన్నారు. చంద్రబాబునాయుడు,పవన్ కళ్యాణ్ కావాలని లేని పోని విమర్శలు చేస్తున్నారని జగన్‌మోహన్‌రెడ్డి వెంట్రుక కూడా పీకలేరని అన్నారు.

ఈకార్యక్రమంలో డిఎపి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి,. మండల కన్వీనర్ బెజవాడ గోవర్దన్‌రెడ్డి, సిఐ కోటేశ్వరరావు, తహసిల్దారు చంద్రశేఖర్,ఎంపిడిఒ సుబ్రమణ్యం, ఎస్ఐ భాస్కర్‌బాబు,గౌరవాధ్యక్షులు నవీన్‌రెడ్డి, జడ్పిటిసి లక్ష్మయ్య, ఎంపిపి భావనమ్మ,సర్పంచ్‌వినోద్, పలువురు ప్రజాప్రతినిదులు ,అధికారులు వైసిపి నాయ కులు,కార్యకర్తలు పాల్గోన్నారు.





## నెల్లూరులో శివదీక్షస్వాముల నగరోత్సవం







# అక్రమ లేఅవుట్లపై దాడులు, ఫెనాల్టీలు

**కావలి, నవంబరు 22 ప్రభాతవార్త** కావలి మున్సిపాల్టీ పరిధిలో దాదాపు వందకు పైచిలుకు అక్రమ లేఅవుట్లు రాజ్యమేలుతున్నాయని వాటిపై కొరడా ఝుళిపించి ఫెనాల్టీలు విధించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కావలి మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. మున్సిపాల్టీ పరిధిలో వేసిన అక్రమ వెంచర్ల నిర్వాహకులకు,



లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి నోటీసులు ఇస్తున్నామన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందం అక్రమ లేఅవుట్ల వివరాలు సేకరించడంతో పాటు నోటీసులు జారీ చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫెనాల్టీలు విధించి తగిన చర్యలు గైకొనడం జరుగుతుందని కమిషనర్ బి.శివారెడ్డి హెచ్చరికలు చేశారు.

## మర్రిపాడులో లారీ ఢీకొని ఒకరు మృతి

మర్రిపాడు,నవంబర్22ప్రభాతవార్త: మండల కేంద్రమైన మర్రిపాడులో మంగళవారం లారీ ఢీకొని ఒకరు మృతిచెందారు. మృతిచెందిన వ్యక్తిని మండల పరిధిలోని ఇర్లపాడుకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు(50)గా గుర్తించారు. ప్రత్యక్షులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇర్లపాడుకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు తన సెల్‌ఫోన్ రిపేరుకై మండల కేంద్రమైన మర్రిపాడుకు వచ్చాడు. సెల్ రిపేరు చేసుకొని రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుండి బద్వేల్‌వైపు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ వెంకటేశ్వర్లును ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు సమాచారం తెలుసుకొని సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులకు కంటతడిపెట్టించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు.

